# జిడ్డు మనుషులు

కిష్టూ

మన మామూలు మనుషుల్లోనే ఒక రకం గమ్మత్తు మనుషులున్నారు. వీళ్లు కొంచెం బాగా డబ్బున్న వాళ్ళతోనూ, పేరులోకి వస్తున్న వాళ్ళతోనూ ఎక్కువగా తిరుగుతూంటూరు. మొదట మొదట నాకు వీళ్ళ సంగతి ఎక్కువగా తెలియదు. తేలిగ్గా చెప్పాలంటే ఇంగ్లీషు భాషలో వాళ్ళని "పేరసైట్సు" అంటారు. మన వాడుక భాషలో వీళ్లు ఆముదంగాళ్లు, జిడ్డుగాళ్లు, తైరుగాళ్లు, తోముడుగాళ్లు, భట్రాజులు ఇత్యాది పేర్లతో చలామణి అవుతున్నారు.

వీళ్ళనుగురించి అసలు ఎందుకు చెప్పాల్సొచ్చిందంటే ఒకనాడు ఉదయం ఒక వారపత్రిక కొనుక్కొని హోటలుకు వెళ్ళాను. హోటలు చాలా రష్‌గావుంది. ఒక మూల మటుకు ఒక చిన్న బల్లా, రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి. మంచి హోటలు అంటే ఒక్కొక్క ఐటమూ మన దగ్గరకు రావడానికి కనీసం ఒక అరఘంట తీసుకుంటుందీ అని చెప్పక తప్పదు. సరే కానున్న ఆలస్యం ఎలాగో కాకతప్పదుగదాని ఈ లోపల చేతిలో వున్న పేపరు చదువుతున్నాను.

కుర్చీ బరబరా ఈడ్చిన చప్పుడైతే తలెత్తి పైకి చూశాను. "క్షమించండి, డిస్టర్బు చేసినట్టున్నాను" అన్నాడా పెద్ద మనిషి. అలా ఎందుకంటున్నానంటే ఆయన వేషం, వాలకం చూస్తే అలాగే కనబడ్డాడు మరి. నున్నగా పైకి ఎగదువ్విన క్రాపు, కళ్ళజోడూ, జరీ అంచు కండువా, పెదవుల చివరదాకా వున్న మీసకట్టు, ఇవన్నీ చూసి అతడు పెద్దమనిషి కాడు అని ఎవరనగలరు చెప్పండి.

"ఆఁ. ఆఁ. మరేమీ పర్వాలేదు లెండి" అన్నాను. ఏమీ అనకపోతే బాగుండదని.

"ఏమిటండీ మీరు చదువుతున్న పత్రిక?" అనడిగాడు.

మాటాడకండా పత్రిక అతని చేతికిచ్చాను.

పత్రిక మొదట్నుంచీ చివరిదాకా పేజీలు తిప్పి చూస్తూ ఒకచోట ఆగాడు. "చూడండి దీంట్లో 'వెంకట్రావు' రాసిన కథ చదివారా?" అనడిగాడు.

అది నా కథే. అయినా ఏమంటాడో కథను గురించి అని, "ఎబ్బే ఏమీ చదవలేదండి దాన్లో. ఇప్పుడే తీసుకున్నాను–" అన్నాను ఏమీ తెలీనట్టు నటిస్తూ.

"చాలా బాగా వుంటుంది! మీరు తప్పక చదవండి ఆ కథ. ఆ కథే ఏమిటి, ఆయనరాసిన కథలన్నీ తప్పక ప్రతి ఒకరూ చదవాల్సిందే." అన్నాడు ఆ కథల్ని ఎంతో మెచ్చుకునేవాడిలా.

చూడండీ, ప్రతివాడికీ అంతో ఇంతో, తను గొప్పవాడౌదామనీ, నలుగురిలో కాస్త పేరు సంపాదిద్దామనీ వుంటుంది. అదే నన్నుకూడా పట్టుకుని పీడించింది. దాంతో వెంటనే అందుకున్నాను, "ఆ వెంకట్రావు రాసిన కథ వుంది చూశారూ, అది నేనేనండీ రాసింది" అన్నాను కొంచెం గర్వంగా.

"అరె! ఏమిటీ! మీరా! మీరేనా ఆకథలు రాసేది?" ఆశ్చర్యాన్నంతా ప్రకటిస్తూ అడిగాడు.

"ఎందుకు అలా ఆశ్చర్యపడతారు. నేనంటే మీరు నమ్మరా!"

"ఆహా, అదికాదు ఇందాకట్నుంచీ చెప్పలేదే. మీవంటివాళ్ళే అయుండాలనుకున్నాను. మీ కథల్ని బట్టి మీలో గొప్ప కథకులకు కావలసిన లక్షణాలన్నీ ఇమిడివున్నయ్."

"వానికేమిటిలెండి ఎవరైనా రాయొచ్చు కథలు."

"నేను కాదవను. కాని చెత్తకథలు రాసే వాడికీ మంచి కథలు రాసేవాడికీ తేడా వుండదండీ?"

సంభాషణ ఆగిపోకముందే సర్వరు వచ్చి "ఏమి కావాలి సార్" అన్నాడు. ఇద్దరికీ టిఫిన్ ఆర్డరు చేశాను.

ఈలోగా మా సంభాషణ ప్రారంభమైంది మళ్ళీ. అతను నా కథల్ని గురించి యెంతో పొగిడేస్తున్నాడు. నిజం చెప్పాలంటే నాకూ అతని కబుర్లు వింటూంటే చాలా సర్దాగానే వుంది. ఎందుకంటే ఇంతవరకూ నా కథల్ని యిలా పొగిడినవాడు కనబళ్ళేదు.

సర్వర్ని కేకేసి హాట్ వచ్చేలోపల స్వీటు పట్టుకునిరమ్మన్నాను. స్వీటు తెచ్చాడు సర్వరు. అతను చాలా ఆత్రంగా తినివేశాడు నాకంటే చాలా తొందరగానే. "ఇక్కడ వెధవ మైసూర్ పాక్ బావుండదండీ, తింటే గులాబ్ జామ్ తినాలి ఇక్కడ" అన్నాడు నియోగ్యంగా.

అవతల వాడలా అంటూంటే ఏంచేస్తాం చెప్పండి. అందుకని మళ్ళీ రెండు గులాబ్ జామ్‌లు ఆర్డరు చేశాను. అవీ వచ్చినయ్. దాన్ని కూడా ఇందాక తిన్నంత ఆత్రంగానే తిన్నాడు. ఇంతలో హాటు తీసుకువచ్చాడు సర్వరు. ఇక లాభంలేదని కాఫీ పట్టుకు రమ్మ న్నాను. కాఫీ రాగానే హాటు పూర్తిచేసి కాఫీ తాగేశాడు. జేబులోంచి రెండు వక్క పొడిపొట్లాలు, సిగరెట్ కేసూ తీసి అతనికి అందించాను. నాకు కొంచెం అసంతృప్తిగానే వున్నా తృప్తిలేకపోలేదు. ఎందుకంటే, ఈ కాలంలో డబ్బులేకండా వూరికినే పొగిడే వాడెవడు? అవికూడా తీసుకుంటూ, "ఏవాళ చాలా సుదినం. మీబోటివాళ్ళతో పరిచయం చేసుకోవడమూ, మీ ఉదార హృదయాన్ని రుచిచూడటమూ సామాన్యంగా అందరికీ లభించవు" అన్నాడు దాదాపు కృతజ్ఞతను తెల్పుతున్నట్టు.

"అలా అనకండి, నాబోటివాళ్లను ఎంత మందిని చూసుంటారో మీరు" అన్నాను అహంభావాన్ని వ్యక్తంచేయకండా. అతను నాకంటే ముందుగానే వెళ్ళిపోయాడు. నేను క్యాషియరు దగ్గరకు వెళ్ళాను బిల్లు ఇవ్వడానికి. "మిమ్మల్నెలా పట్టాడు వాడు" అన్నాడు క్యాషియర్.

నాకేమీ అర్థంకాలేదు. ఏమీ తెలీనట్టు ముఖాన్ని పెట్టి, "ఏమిటి అతన్నిగురించి చాలా తేలిగ్గా మాట్లాడుతున్నారే" అన్నాను.

"కాకపోతే ఏమిటండీ. రోజూ ఎవర్నో ఒకర్ని పడుతూంటాడు. మీబోటి వాళ్లను నలుగురిని చేతిలో వేసుకుని, మీరు ఇంద్రులూ, చంద్రులూ అని స్తోత్రంచేసి జీవనంచేస్తుంటాడు" అన్నాడు క్యాషియరు అతన్ని గురించి హేళనగా.

"నన్నెలా కనుక్కోగలిగాడు."

"అతడికి తెలీనివారులేరు ఈవూర్లో. అంతే కాకుండా చుట్టుపక్కల వూళ్ల వాళ్ళందర్నీ కూడా ఎరుగున్నాడు."

ఆతర్వాత రెండుమూడుసార్లు కన్పించాడు గాని, అతనివైపు చూడకుండా ముఖం తిప్పేసే వాణ్ణి.

అప్పుడు తెలుసుకోవడం ప్రారంభించాను. ఇటువంటివాళ్లే కాదనీ, వాళ్ళలో ఇంకా చాలా రకాలవాళ్లున్నారనీ. అంతకుముందుకూడా ఈ విధమైన వాళ్ళచేత కాస్త దెబ్బతిన్నవాడిని అవడంచేత కొంచెం అనుభవం సంపాదించాను.

వాళ్ళలో ఇంకోరకం తెగవాళ్ళున్నారు. వాళ్ళ తెగులేమిటంటే, వాళ్ళకి కర్చుపెట్టు కోడానికి చాలినంత డబ్బువుంటుంది. కాని దాన్ని కర్చుపెట్టకుండా బ్యాంకులోవేసి,డబ్బు కావలసివస్తే ఇతర్లదగ్గర అప్పుకింద తీసుకుని ఛస్తే మళ్ళీ వాళ్లకివ్వరు. ఈమధ్య నా స్నేహితుడు వచ్చి పదిరూపాయలు ఎక్కడైనా అవసరంగా చూసిపెట్టమని ప్రాధేయపడ్డాడు. నాకు ఆశ్చర్యమేసింది. వాడికేమిటి డబ్బుకరువు అని. తర్వాత వాడే చెప్పాడు వెంకటేశ్వరరావు తన దగ్గరున్న పందరూపాయలూ జీతంరాగానే పట్టుకెళ్ళి ఇంతవరకు నాలుగునెలలైనా కూడా ఇవ్వలేదట. మా వాడు కాస్త మొహమాటస్తుడు కావటం చేత అడగలేదు. అయినా

వాడంటాడు "నేను చస్తే వాడిని డబ్బు అడగ తల్చుకోలేదు. రెస్పాన్సిబిలిటీ తెలుసుకున్న వాడైతే వాడంతట వాడే తెచ్చిఇవ్వాలి" అని.

అప్పుడు నేను "ఒరే వెర్రి వెధవా, వాడి గొంతులో ఊపిరి వున్నంతవరకూ వాడిక ఆ డబ్బు నీకు ఇవ్వడు, నువ్వు మాట మాటకు అడిగి పీడించబోయేవరకూ. కనక తిండి దగ్గరా డబ్బుదగ్గరా మొహమాటం పెట్టుకోకుండా వాడిదగ్గర్నుంచి ఆ డబ్బు ఏలాగో రాల గొట్టుకో" అని హితవు చెప్పాను.

మరికొందరున్నారు. వాళ్ళను ఎంతతిట్టినా, ఏడ్పించినా సరే మన్నివదలరు జలగల్లాగ. రోషం రాదు, కోపం రాదు మనమీద. ఎందు కంటే వాళ్లు మనమీదేగా ఆధారపడేది.

ఈమధ్య వాల్తేరులో చదువుకుంటున్న స్నేహితు డొకడు నాకు వుత్తరం రాస్తూ దానిలో ఈ విధంగా ఏడ్చాడు. "నాకు మా వాళ్ళు నూట యేభై రూపాయలు పంపిస్తు న్నారు. కాని ఇరవైయో తారీకు గడవకం డానే దాన్లో ఒక్క కానీ మిగలటం లేదు. ఇంత డబ్బూ నే నొక్కణ్ణే ఏం చేస్తున్నాను అనుకోకు. నాకు ఒక జిడ్డుగాడు దూమ్మేటుగా తగిలాడు. వాడికి వాళ్ళ ఇంటినుంచి మని యార్డరు ఖర్చులుపోను, ఏభై తొమ్మిదింబావలా వస్తుంది. ఇక వాడు తలనూనె దగ్గర్నుంచీ, సిని మాలకీ, సిగరేట్లకీ ఓహ్! ఒకటేమిటి అన్నిటికీ నామీదే పడేడుస్తాడు. మనకి మొహమాటం కూడాఏడిసిందాయె గట్టిగా చెప్పడానికి— ఒకవేళ ఎప్పుడన్నా చెప్పినా కళ్ళమ్మట నీళ్లు తెచ్చుకుని అడదానల్లే. ఏడుస్తాడు. జాలిపుడు తుంది. కాని ఒక్క విషయంలో మటుకు సంతోషం, ఏమిటంటే వాడు కృతఘ్నుడు కాడు. ఇంతవరకూ చాలా కాలంనుంచి ఈ పేరా సైటిసమ్ను ప్రోత్సహించ కూడదనుకుంటూ వుండేవాడిని. కాని లాభం లేకపోతూంది." అని రాసుకొచ్చాడు.

ఇలా వుంటుంది ఆముదంగాళ్లపని. అసలు వీళ్ళని తయారు చేయటం అనేతప్పు మనలో వుంది. మనం ప్రోత్సాహం ఇస్తుంటేనే గా వాళ్లు విచ్చలవిడిగా తిరగ గలిగేది. మనం గనక కచ్చితంగా నిర్మొహమాటంగా, "ఒరే అబ్బీ నీ డబ్బుపెట్టుకుని మాతో సినిమా కురా. కాఫీ హోటల్లో తిను, నీ యిష్టంవచ్చిన వేషం వేయి మేం వద్దనం. కాని మామీద ఆధార పడితే నీకు సాడ్డే." అన్నామంటే మరొకసారి మన వెంట ఎందుకు పడతారు?

ఈ మాటకే కొందరంటూరు కదా "నా స్నేహమర్యాదకోసమన్నా వాళ్ళకి మనం పెట్టాలి మిగతా వాళ్ళకు పెట్టినట్టే." అంటే నే నంటాను- "ఎవరైనా మటుకు ఏ స్నేహితుడి కైనా ఎప్పుడూ ఎందుకు డబ్బు పెడతారు. ఒక సారి మనం పెడితే రెండోసారి వాళ్లు పెడ తారు. అలాగే పరస్పరం సర్దుకుంటూరు గాని, ఎప్పుడూ ఒకళ్లమీద ఆధారపడరుగా?"


## జమ్మి వెంకట రమణయ్య అండ్ సన్సు,

హెడ్డాఫీసు : మద్రాసు-4.

### నోటీసు

విజయవాడ, విజయనగరములలో ఉన్న మా ఆఫీసులు రెండున్నూ ఏప్రిలు 1, 1951 నుండి ఉమ్మడిగా ఒక్క విజయనగరము నుండియే పనిచేయును. మా ఖాతాదార్లు, ముఖ్యముగా ఆంధ్ర ప్రాంతములవారు, ఇది గమనించి, యికముందు ఉత్తర ప్రత్యుత్తరములు యీ క్రింది ఎడ్రసుతో జరుపవలెను:

జమ్మి వెంకట రమణయ్య అండ్ సన్సు,
ఓరుగంటివారి వీధి,
విజయనగరము. (విశాఖ జిల్లా)

మద్రాసు
20-3-51.